క్లుప్తంగా

యువజన రంగానికి నిధులు కేటాయించాలి



ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న 2025– 26 వార్షిక బడ్జెట్‌లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించేలా కృషి చేయాలని డీవైఎఫ్‌ఐ నాయకులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ వార్షిక బడ్జెట్‌లో యూత్ డిక్లరేషన్ అమలు చేయాలని, నిరుద్యోగ భృతి కింద యువతకు రూ. 3 వేలు చెల్లించాలని, సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరారు. క్రీడా మైదానాలు, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

దహెగాం: మండలంలోని చినరాస్పెల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన తేలుకుంట్ల రాజేశ్ అనే ఆర్మీ ఉద్యోగి వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత మాట్లాడుతూ.. విద్యార్థులు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు వినియోగిస్తున్నందున ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఆర్మీ ఉద్యోగి రాజేశ్ స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవ కిషన్, పాఠశాల చైర్మన్ సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

కలిసి ఉండడమే మేలు



మాట్లాడుతున్న తహసీల్దార్ కవిత

దహెగాం: ఇరువర్గాలుగా వీడిపోయి కంటే కలిసి ఉండడమే మేలని తహసీల్దార్ కవిత అన్నారు. సోమవారం మండలంలోని ఇట్యాల గ్రామంలో ఒకే కులం, వర్గానికి చెందిన వారు వేర్వేరుగా ఉంటున్నందున వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒకే వర్గానికి చెందిన వారు 23 కుటుంబాలు ఉండగా.. అందులో 8 కుటుంబాలు ఒకవైపు, 15 కుటుంబాలు వేర్వేరుగా ఉంటున్నారు. వేర్వేరుగా ఉండడం సరికాదన్నారు. ఇక నుంచి అందరం కలిసి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన



పరిశీలిస్తున్న మునేశ్వరి

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామంలో జిల్లా సేంద్రియ వ్యవసాయదారుల ఉత్పత్తి సంఘం ధ్రువ పత్రాలను రిజిస్ట్రేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మునేశ్వరి పరిశీలించారు. ఇటీవల నూతనంగా సంఘం రిజిస్టర్ చేయబడింది. ఈ నేపథ్యంలో సేంద్రియ రైతులను ఏకతాటిపైకి తీసుకువచ్చి జిల్లాలో సేంద్రి వ్యవసాయ ఉత్పత్తిని పెంచాలన్నారు. కార్యక్రమంలో రైతులు బాలాజీ, న్యానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి



అవగాహన కల్పిస్తున్న రాజేష్

కెరమెరి: మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమని ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫై ట్రైనర్, జన్కాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వడ్లూరి రాజేష్ అన్నారు. మహిళా సాధికారత విభాగంలో భాగంగా బేటీ పడావ్.. బేటీ బచావ్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని గోయగాంగా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆత్మస్థైర్యం, సమయ నిర్వహణ, పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నల్లగొండ్ రమేశ్, ప్రవీణ్, శ్రీనివాస్, అర్చన, జైవంత పాల్గొన్నారు.

జనసంద్రమైన వెంకన్న జాతర

ధ్వజస్తంభం వద్ద టెంకాయ కొడుతున్న భక్తులు



వెంకన్నకు మొక్కుతున్న భక్తులు



కెరమెరిలో జరుగుతున్న వేంకటేశ్వరస్వామి జాతర జనసంద్రమైంది. గత 12 రోజులుగా కొనసాగుతున్న జాతరకు ఆది, సోమవారాల్లో జనం పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామి దర్శనం చేసుకున్న తర్వాత తమకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేశారు. కిరాణా, హోటళ్లు, గాజులు, ఆడియో, వీడియో సీడీలు, టాటూ, ఉయ్యాలలు, బోళ్ల దుకాణాలు కిక్కిరిసిపోయాయి. - కెరమెరి



జాతరకు భారీగా తరలివచ్చిన జనం



వంటపాత్రలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



గాజుల దుకాణాల వద్ద మహిళలు సందడి



జాతరలో ఏర్పాటు చేసిన రంగులరాట్నం

చదువుతోనే బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న సభ్యులు

కౌటాల: చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని జిల్లా మహిళా సాధికారత కేంద్రం మోటివేటర్ మామిడాల తిరుపతయ్య అన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కౌటాల కేజీబీవీ పాఠశాలలో ప్రేరణ, స్ఫూర్తిదాయక విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు తప్పనిసరిగా చదువుకోవాలని, చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని తెలిపారు. మహిళలు సాధికారిత సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. బాల్య వివాహాలు చేసుకొవద్దని, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షలంటే విద్యార్థులు భయపడొద్దని, ఒత్తిడిని జయించితే మెరుగైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోడీ పవిత్ర, ఉపాధ్యాయులు శిరిష, భువనేశ్వరి, సంధ్యరాణి, రాజమణి, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ముందడుగు వేయాలి



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ రమేశ్

రెబ్బెన: అమ్మాయిలు ప్రతీ రంగంలో రాణించేందుకు ధైర్యంగా ముందడుగు వేయాలని మోటివేషనల్ ట్రైనర్ సుందిల్ల రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని సోషల్ బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో సోమవారం బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ప్రేరణ, స్ఫూర్తిదాయక అంశాలపై అవగాహన కల్పించారు. లక్ష్యం కోసం పట్టుదలతో శ్రమించాలన్నారు. విద్యార్థులకు నైతిక విలువలు ఎంతో అవసరమని ఆత్మ స్థైర్యం ఉండాలన్నారు. బాలికలు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని జీవితంలో అనుకున్న లక్ష్యం సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజినీ, వైస్ ప్రిన్స్‌పాల్ రజిత, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టు రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుద్ధవిహార్‌ను అప్పగించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌటాల: బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయ మహాబోధి బుద్ధ విహార్‌ను బౌద్ధ భిక్షువులకు అప్పగించాలని సోమవారం కౌటాల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పలతకు బౌద్ధ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1949 బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో మహాబోధి బుద్ధ విహార్‌ను బ్రాహ్మణ కబంధ హస్తముల నుంచి విముక్తి కల్పించాలన్నారు. గతంలో బౌద్ధ భిక్షువుల ఆధీనంలో ఉన్న మహాబోధి బుద్ధ విహార్ బ్రాహ్మణ పండితుల ఆధీనంలో ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు బండురావు, ఉపాధ్యక్షుడు ఏమాజీ, యశ్వంత్ రావు, ఆత్మరాం, నాందేవ్, విఠల్ పాల్గొన్నారు.

భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త ఆత్మహత్య

రెబ్బెన(ఆసిఫాబాద్): కట్టుకున్న భార్య అనారోగ్యంతో ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోవడంతో ఆ బాధను తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నంబాలకు చెందిన పెద్దపల్లి మధూకర్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని భార్య 5 సంవత్సరాల క్రితం కిడ్నీ సంబందిత వ్యాధితో మృతి చెందగా అప్పటి నుండి ఆమె గురించే ఆలోచిస్తూ మానసికంగా కృంగిపోసాగాడు. కుటుంబ సభ్యులు ఎంతలా నచ్చ చెప్పిన భార్య జ్ఞాపకాలను మర్చిపోలేక తను లేని ఈ లోకంలో నేను కూడ ఉండనని కుటుంబ సభ్యులకు తరుచు ఆమె గురించే ఆలోచిస్తూ కృంగిపోతుండేవాడు. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం చేనులో పత్తి కట్టెను కాల్చి వస్తానని చెప్పి ఇంట్లో నుండి బయలుదేరాడు. సాయంత్రమైన తిరిగి ఇంటికి రాకపోవటంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు మధుకర్ కోసం తమ బంధువైన ప్రవీణ్‌ను పత్తి చేనుకు పంపించారు. ప్రవీణ్ పత్తి చేనుకు వెళ్లి చూడగా మధూకర్ స్పృహ లేకుండా పడి ఉండగా ఎంత లేపిన లేవకపోవడంతో విషయాన్ని మధూకర్ కుటుంబ సభ్యులకు తెలిపాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు చేనుకు వచ్చి చూడగా స్పృహ లేకుండా పడి ఉన్న మధూకర్ వద్ద గుర్తు తెలియని పురుగుల మందు వాసన రావడంతో ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తించారు. భార్య లేని లోటును భరించలేక జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుమారుడు నరేశ్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

‘ఎస్సీ వర్గీకరణ లోపాలను సరిదిద్దాలి’

నార్నూర్: ఎస్సీ వర్గీకరణలో ప్రతిపాదిత లోపాలను సరిదిద్ది అన్ని కులాలకు సమన్యాయం చేయాలని మహార్ నేతకాని ఇంటలెక్చువల్ ఫోరం సభ్యులు డిమాండ్ చేవారు. సోమవారం బీఆర్‌కే భవన్ హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ తెలంగాణ వారికి వినతిపత్రం అందజేసినట్లు ఫోరం ప్రతినిధులు కొలేట్కర్ పరమేశ్వర్, జాడే నాగోరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన రాష్ట్రాల్లో పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో వర్గీకరణ చేసినప్పుడు రిజర్వేషన్ శాతాన్ని పెంచి వర్గీకరణ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం కులగణన 2024 జనాభా ప్రతిపాదిన రిజర్వేషన్‌ను పెంచి గ్రూపులుగా వర్గీకరించాలన్నారు. నేతకాని మహార్ కులాలను ఎస్సీ (సి) రిజర్వేషన్ కేవలం 5 శాతం చూపించడం జరిగిందన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు, సర్టిఫికెట్లతో విద్యార్థినులు

రెబ్బెన(ఆసిఫాబాద్): పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్‌లో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రెబ్బెన మండలంలోని నంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ చాపిడి కుమార్ తెలిపారు. సింగిల్ కటా విభాగంలో డి.ప్రణీత బంగారు పతకం, ఆర్.సోనూ వెండి పతకం, ఐ.హరిత కాంస్య పతకం సాధించారని పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థినులను ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తా



బహుమతి అందుకుంటున్న లక్ష్మణ్

తిర్యాణి: ఉమ్మడి జిల్లా బాడీ బిల్డింగ్ పోటీల్లో తిర్యాణి మండలం నాయకపుగూడ గ్రామానికి చెందిన గుండం లక్ష్మణ్ సత్తా చాటాడు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఆదివారం రాత్రి బాడీ బిల్డింగ్ పోటీల్లో 75 కేజీల విభాగంలో మొదటి బహుమతి సాధించాడు. కాగా మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో లక్ష్మణ్ పీడీగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

రెబ్బెన: సింగరేణిలో పని చేసే ప్రతీ ఉద్యోగి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. జీఎం కార్యాలయంలో ఐటీ విభాగంలో బదిలీ వర్కర్‌గా పని చేసి అనారోగ్య సమస్యతో మృతి చెందిన రుబీనా తారన్నుమ్‌కు సోమవారం జీఎం కార్యాలయం సిబ్బంది సంతాపం ప్రకటించారు. జీఎం మాట్లాడుతూ అతి చిన్న వయస్సులో మృతి చెందడం బాధ కలిగించిందన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఐటీ హెచ్‌వోడీ ముజీబ్, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, ఫైనాన్స్ మేనేజర్ రవి పాల్గొన్నారు.

రికార్డులు నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: అన్నిరకాల రిపోర్టులను నమోదు చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని సాంగ్వి పాఠశాలలను ఆయన సందర్శించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ రిపోర్టులు, సీసీఈ రిజిస్టరును పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. వివిధ రకాల రిజిస్టర్లను పరిశీంచారు. విద్యార్థులతో బోర్డుపై రాయించారు. నాణ్యమైన విద్యను అందించాలని చూశారు.

సావిత్రీబాయి పూలే ఆశయాలు కొనసాగిద్దాం



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళా సాధికారత కోసం పోరాడిన సావిత్రీబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం పార్టీ రాష్ట్ర కారదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయి పూలే పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కూశన రాజన్న, శ్రీనివాస్, దినకర్, కార్తీక్, సాయికృష్ణ, జాదవ్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలో సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలు చదువుకోవాలని, వారి చదువు ప్రపంచానికి వెలుగు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సోనేరావు, వాడై దేవేందర్, సోమ, తిరుపతి, సోంజి, సెద్మకి తుకారాం పాల్గొన్నారు.

వాంకిడి: తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే ఆదర్శప్రాయురాలని మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్నులే నారాయణ అన్నారు. సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, విలాస్, బాబురావు, జైరాం, ప్రశాంత్ పాల్గొన్నారు.

కౌటాల: సావిత్రీబాయి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి అని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్ రావ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మాలీ సంఘం భవనంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు మోర్లె పాండురంగ్, నాందేవ్, బాబురావు, నారాయణ, సంగీత్‌రావ్, ప్రవీణ్, రాజేశ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాలీ నాయకులు



పూలమాలలు వేస్తున్న నాయకులు

కొండా లక్ష్మణ్ పేరు ప్రకటించడం హర్షణీయం

ఆసిఫాబాద్‌రూరల్: బీసీ యువజన సంఘం పోరాట ఫలితంగానే జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలకు కొండా లక్ష్మణ్ పేరు ప్రకటించడం హర్షనీయంమని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ కుమార్ సోమవారం తెలిపారు. మెడికల్ కళాశాలకు కొండ లక్ష్మణ్ బాపుజీ నామకరణం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. బీసీ సంఘం అధ్వర్యంలో గతంలో ఎమ్మెల్యే, మంత్రి, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిప్రతం అందించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు

సిరికొండ: మండల కేంద్రంలో సోమవారం బో థ్, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేలు అని ల్ జాదవ్, వెద్మ బొజ్జు పటేలు పర్యటించారు. ఈసందర్భంగా మండలానికి మంజూరైన పీహెచ్‌సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు బోథ్ ఎమ్మెల్యే సుంకిడి గ్రామంలో నిర్మిస్తున్న జగదంబ దేవి ఆలయ పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్ర భవనానికి, సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ.. మారుమూల మండలంను ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. డీఎల్‌పీవో ఫణీందర్, తహసీల్దార్ తుకారం, ఎంపీడీవో రవీందర్ పాల్గొన్నారు.